
# నీతీ! నీ చిరునామా ఎక్కడ?



"ఏమన్నావ్? గోపాల్రావ్ అన్నదేంటో తెలిసినప్పటికి సందేహం తీరక మళ్ళీ అడిగేడు పాపారావ్

"మా నాన్న చేసిన బాకీలు తీర్చేయాలనుకుంటున్నాను గోపాల్రావు రిపీట్ చేసేడు

"రాత్రి టూరింగ్ టాకీస్‌లోగాని కొంపతీసి సత్య హరిశ్చంద్ర' సినిమా చూశావా? లేదు

"పోనీ, పొరపాటున గుళ్లో శాస్త్రిగారి పురాణాని కెళ్తున్నావా?

'నాకు గుడికివెళ్ళే అలవాటు లేదు

మరైతే ఏ మంత్రిగారిదైనా ఉపన్యాసం గట్రా విన్నావా

నేను సభలకు వెళ్ళను" గోపాల్రావు సమాధానం తాపీగా వుంది

ఏవీ లేకపోతే యీ పాడు బుద్ధి ఎలా పుట్టిందిరా? నా కనుమానంగా వుందీ, గవర్నమెంటు ఆసుపత్రిలో ఇంజెక్షనేమీ తీసుకోలేదు గదా!

ఒరేయ్ పాపారావ్! సరదాగా తీసుకోకు నేను చాలా సీరియస్‌గా చెబుతున్నాను ఆ బాకీలు నేనైనా తీర్చెయ్యాల్సిందే గోపాల్రావ్ కంఠం నిశ్చలంగా వుంది

'సీరియస్ తగలడా' కాస్సేపట్లో విమానం

## చందక రాజారామ మోహనరావు

కూలిపోతుంది, పేరాచూట్లు సిద్ధం చేసుకోండి" అని ఎవరైనా తాపీగా చెబుతారట్రా! ఇవేం పిదప కాలం బుద్ధుల్రా?

"అప్పులు తీర్చుకోవటం పిదప కాలం బుద్ధులట్రా?

కాక"? అవునూ, ఇదే కాలం,

చలికాలం'

'నీ పిండా కూడు, కలికాలం రా,

"మన దే దేశం"?

"తెలుగు దేశం"

"ఓరి దరిద్రుడా; నేనడిగేది పార్టీ గురించి కాదురా; మనది భారతదేశం అవునా?

"అవును"

"ఇదే సంవత్సరం?

"పంథొమ్మిది వందల ఎనభై అయిదు; ఏంటిరా చచ్చు ప్రశ్నలు బడిపంతుల్లా; గోపాల్రావుకు చిరాకేసింది.

"ఒరేయ్ దద్దమ్మా! నోట్లు బాకీలు, కోర్టులో డిక్రీలు పొందిన బాకీలే యీ రోజుల్లో ఎగిరిపోతోంటే ఏనాడో పదిహేనేళ్ల నాటి – అదీ మీ నాన్న చేసిన అప్పులు – అవీ కోర్టులో రద్దయిపోయింతర్వాత ... నేను తీరుస్తాను అంటే జనం నీకు పూలమాలలు వేయరు. రాళ్లిచ్చు కొడతారు పిచ్చోడనుకొని. అందుకని నా మాట విని, ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు మర్చిపోయినట్టు, బాకీలు మర్చిపోయి హాయిగా నిద్రపో."

"నా బాధ నర్థం చేసుకో; ఆనాటి పరిస్థితుల్లో మా నాన్న బాకీలు తీర్చలేకపోయేడు. ఈ వేళ నా స్థితి ఫర్వాలేదు. అలాంటప్పుడు నేనైనా ఆ బాకీలు తీర్చేసి ఋణం తీర్చుకోవద్దా!

"కోర్టులో ఐ. పి. దాఖలు చేసి బాకీలు రద్దు చేయించేసుకున్న తర్వాత ... ఆ బాకీలు తీర్చడవేంటిరా; ఓట్లేసిన తర్వాత కూడా జనానికి దణ్ణంవెట్టినట్టు;

"కోర్టులో గెలవొచ్చు అది సాంకేతికపరమైన విషయం; కాని అప్పులు తీర్చడం అనేదే నైతిక సంబంధమైనది. యీ సోదంతా ఎందుకు, నాకు సాయం చేస్తావా? లేదా? గోపాల్రావు కంఠంలో చిరాకు వ్యక్తమైంది.

"ఉరేసుకు చస్తాను; తాడు తెచ్చిపెట్టు అంటే ఏం చేసేది; నీ ఖర్మ! నన్నేం చెయ్యమంటావో అఘోరించు"

# నీతీ! నీ చిరునామా ఎక్కడ?

"నాతో బాటు మా వూరొచ్చి ఆ బాకీలు సెటిల్ చేసిపెట్టు" అంతే;

"సరే అలాగే వస్తాను. కానీ మళ్లీ ఆలోచించుకో. యీ వ్యవహారంలో కొన్ని చికాకులు రావొచ్చు. తర్వాత నీ ఇష్టం" గోపాల్రావు మనస్సు మార్చడానికి మళ్లీ ప్రయత్నం చేసాడు ... అయినా అది సాధ్యపడలేదు ప్రతిపక్షాల ఐక్యతలా.

"ఆలోచించిందేమీ లేదు. ఎల్లుండే ప్రయాణం. సిద్ధంగా ఉండు." గోపాల్రావు బయల్దేరాడు.


"ఒక్క నిముషం ...."

"ఏంటి? అన్నట్టు వెనక్కు తిరిగేడు.

"నాకేదో అనుమానంగా వుంది; నీకేమైనా గాలి పట్టిందేమోనని. మీ మామ్మతో చెప్పి తాయెత్తు కట్టించుకో"

సమాధానంగా చిన్న నవ్వు నవ్వేడు గోపాలరావు ..."వస్తాను" అని చెప్పి బయల్దేరేడు. పాపారావు ఆలోచనలో పడ్డాడు గోపాలం వెళ్లిన తర్వాత. "ఏమిటీతని తత్వం! డబ్బు విషయంలో మొగుణ్ణి పెళ్లాం, తల్లిని కొడుకు నమ్మని యీ రోజుల్లో యింత నిజాయితీ ... అందులోనూ ఏమాత్రం ప్రాపంచిక విషయాలు తెలియనట్టు కనిపించే గోపాల్రావులో .... ఆశ్చర్యంగా వుంది.

అసలు గోపాల్రావుది యీ వూరు కాదు. విజయనగరం. అతని తండ్రికి ఈ వూర్లో బట్టల కొట్టుండేది. అతనిలో "వ్యాపారం" కంటే అమాయకత్వం పాలెక్కువ. "అరువు" అని అడగని వాడిది పాపం, అమ్మాయి పెళ్లనో, చెల్లెలు పెద్దమనిషయిందనో, పండుగనో, పబ్బమనో ఏదో ఒకటి చెప్పి అరువులు పట్టుకెళ్లేవారు. గవర్నమెంటోళ్లు "పాడి గేదెలు" పంచి పెట్టినట్టుగా అందరికీ యిచ్చేడు. అందులో చాలామంది ఎగ్గొట్టే ప్రయత్నాలే చేసేవారు. అయినా మళ్లీ ఒచ్చి అడిగేవాళ్లు తాము పాత బాకీ ఎందుకు తీర్చలేకపోయేమో వివరిస్తూ. గత ఎలక్షన్‌లలో తమ పార్టీ చేసిన వాగ్దానాలు ఎందుకు నెరవేర్చలేక పోయిందోనని వివరించే మహానాయకుల్లా .... అమాయకంగా మళ్లీ వాళ్లను నమ్మేవాడు ఓటరు మహాశయుడిలా. ఇతని పద్ధతి చూసి సాటి వ్యాపారస్తులు నవ్వుకొనేవాళ్లు. "అరువు రేపు" అని బోర్డు తీసేసి "అరువు యిప్పుడే" అని బోర్డు కూడా తగిలించమని సలహాలు కూడా యిచ్చారు. అందులో "వ్యంగం" అర్థమైనా పద్ధతులు మాత్రం అతను మార్చుకోలేక పోయేడు. క్రమంగా బాకీలు దిన దిన ప్రవర్ధమానమయ్యేయి. ప్రజాసేవకుల సంపదల్లా. మార్కెట్‌ట్లో యితనికి అరువులు యిచ్చినవాళ్ల ఒత్తిడి ఎక్కువైంది. ఎన్నికల్లో మైకుల హోరుల్లా. కాని యితని దగ్గఱ అరువులు తీసుకున్న వాళ్లు తుపాకీ దెబ్బకు కూడా దొరకలేదు గెలిచిన యమ్మెల్యేలా. కట్టు బట్టలు మాత్రం మిగుల్చుకొని ఉన్నదంతా తెగనమ్మి బాకీలు తీర్చేసినా యింకా అప్పులవాళ్లు మిగిలిపోయేరు. వాళ్లకు చేతులెత్తి నమస్కరించి మరీ చెప్పేడు "నా వద్ద చిల్లి గవ్వ కూడా లేదని" "అది ఉంటే మాత్రం మాకెందుకు" అన్నారు బాకీలవాళ్లు. అని వూరుకోలేదు కోర్టుకెక్కేరు. తప్పని పరిస్థితిల్లో ఐ. పి. దాఖలు చేసాడు. కోర్టు యితని వాదన నమ్మింది, గెలిచేడు. అయినా అతను సంతోషించలేదు. "వోడిపోయినా పోలయిన ఓట్ల శాతం పెరిగిందని" ఎగిరి గంతేసే అభ్యర్థిలా. తన దుస్థితికి క్రుంగిపోతూ "జిలేబీలమ్మిన చోట్ల జంతికలమ్మ లేక" అక్కడి నుండి మకాం ఎత్తేసి "జగ్గయ్యపేట" వచ్చేసాడు. అప్పుడు గోపాల్రావు వయస్సు పదిహేనేళ్లు. ఆస్తి కట్టు బట్టలు, చేతిలో చిన్న మూట. మూటలో వంతెన పక్కన అడుక్కొనే వాళ్ల మూటల్లోలా ట్రాన్సిష్టర్లు, టేపు రికార్డర్లు, బ్యాంకు పాసు పుస్తకాలూ లేవు. కేవలం ఒక బొంత, రెండు దుప్పట్లు, ఆంజనేయస్వామి పటం. కాశీమజిలీ పుస్తకాలూ వున్నాయ్. యీ వూర్లో అతని దూరపు బంధువులూ – దగ్గరి మిత్రులూ కలిసి "బట్టల మూట" అప్పజెప్పేరు. యీ సారైనా జాగ్రత్తగా వ్యాపారం చేసుకొని నిలదొక్కుకోమని సలహా చెప్పేరు. "టిక్కెట్టు యిస్తూ హెచ్చరించే పార్టీ పెద్దల్లా". బట్టల మూట సైకిలుపై కట్టుకొని పల్లెటూళ్లలో అమ్ముకొనే వ్యాపారం అది. మూడేళ్లపాటు సైకిలు తొక్కేడు. యిక తొక్కలేక దిగిపోయి మంచం ఎక్కేడు. సైకిలు గోపాల్రావు చేతికొచ్చింది. వంశపారంపర్య పాలనలా. అప్పుడు గోపాల్రావుకు పద్ధెనిమిదేళ్లు.



అయితేనేం వ్యాపారంలో మెలుకువలన్నీ వంట బట్టించుకున్నాడు తండ్రి చేసిన తప్పులు గాని చేయని తప్పులు గాని అతను చెయ్యలేదు దృష్టంతా వ్యాపారం మీదే నిలిపేడు ఎక్కిన సైకిలు దిగలేదు ఆపలేదు గ్రామ గ్రామాలు ఊపేసాడు ప్రాంతీయ పార్టీల ప్రచారంలా ఇరవయ్యేళ్ళొచ్చేసరికి అతను బాగా పుంజుకున్నాడు రిక్షా వాళ్ళకు అప్పులిచ్చే అరవ సోదరుడిలా యీలోగా తండ్రి మంచం మీద నుంచి ఒకేసారి దిగేడు ఆపైన ఎక్కలేదు ఎక్కే అవసరం కూడా రాలేదు దీంతో వ్యాపారం కుటుంబ భారం మొత్తం గోపాల్రావు మీదే పడ్డది ఒకే నాయకుడిపై రెండు పదవుల బారంలా అయినా జంకలేదు రాకెట్టులా దూసుకుపోయేడు పెట్రోలులా మండిపోయేడు మతాబులా వెలిగిపోయేడు చెట్టు క్రింద నుండి హైకోర్టు దాకా పాకిపోయిన ప్లీడరులా పెరిగిపోయేడు పదేళ్ళు గడిచేసరికి 'గృహలక్ష్మి ని లక్ష్మి లాంటి గృహాన్ని, రెండెకరాల పొలాన్ని – సైకిలు స్థానంలో స్కూటర్ని సంపాదించుకున్నాడు అయినా విర్రవీగలేదు 'పళ్ళెం మోసిన పాత్ర నుంచి సూపర్ స్టార్ స్థితికి ఎదిగిన హీరోయిన్‌లా తన స్థితిని తన వాళ్ళను మర్చిపోలేదు మార్పు వేషం లో తప్ప "మనస్సు లో రాలేదు యీ వూరొచ్చినప్పట్నించి పాపారావుతో స్నేహం అది అంచెలంచెలుగా పెరుగుతూ వొచ్చింది సినిమా హీరోయిన్ బంపుసొంపుల్లా ప్రతి పనికి పాపారావు సలహా తీసుకుంటాడు పాటిస్తాడు కూడా గోపాల్రావు వో రకమైన తరహా తన పని తప్ప యితర వ్యవహారాల జోలికి వెళ్ళడు ఎవరో చంద్రలోకంలో కాలెడితే యితను పొంగిపోడు కాలరెత్తడు ఎక్కడో డిల్లీలో క్రికెట్టు ఆడుతుంటే రేడియో చెవుల్లో దూర్చి గిలగిల్లాడి పోడు డిల్లీలో ఎవరో గెలిస్తే జుత్తు పీక్కోడు రాష్ట్రంలో ఓడిపోతే ఎవరి కోసమో బెంగెట్టుకొని మంచం పట్టడు ఎవరిదో సినిమా విడుదలైతే వెర్రెక్కిపోయి చాక్లెట్టు పంచడు ఇంకెవరి పిక్చరో మొదటి రోజునే రెండో ఆటకుకూడా నోచుకోకుండా తిరుగుటపా కట్టేస్తే బోజనం మానుకొని గెడ్డాలూ, గోళ్ళు వగైరాలు పెంచుకోడు ఏ విషయంలో ఎక్కడేం జరిగినా జరక్కపోయినా తనకేపీ పట్టనట్లు మౌనంగా వుంటాడు మరి యితనిలో యిలాంటి "మోరల్ బైండింగ్స్' వున్నాయంటే పాపారావుకు ఆశ్చర్యంగానే వుంది అతనితో అంతస్నేహమున్నప్పటికి

* * * * *

నే విన్నది నిజమేనా?" రాత్రి భోజనాల దగ్గర అడిగింది గోపాల్రావు భార్య అరవింద

"మీ నాన్నగారి బాకీలుతీరుస్తున్నా రటగా?అతను ఏం మాట్లాడక పోయేసరికి మళ్ళీ అంది

అవును" అతని సమాధానంలో హుషారు

# నీతీ! నీ చిరునామా ఎక్కడ?

కనిపించింది తన ప్రయత్నాన్ని భార్యయినా మెచ్చుకుంటుందని

మీకేమైనా పిచెక్కిందా? చచ్చినోడికి షష్టిపూర్తి చేసినట్టుగా పోయిన బాకీలు తీరుస్తారా?

గోపాల్రావు చిన్నబోయేడు అసలే ఉదయం పాపారావు తనని మెచ్చుకోక పోగా తిట్టినందుకు మనసంతా అదోలా వుంది దానికితోడు యింట్లో కూడా వ్యతిరేకమే వచ్చేసరికి స్వంత పార్టీలోనే తిరుగుబాటు ఎదుర్కొంటున్న నాయకుడిలాగుంది' అతని స్థితి

మిమ్మల్నే, మాట్లాడరేం ? అరవింద రెట్టించింది

అప్పులు తీరిస్తే తప్పా?' అతనిలో కాస్త చిరాకు ధ్వనించింది

"తప్పా! తప్పున్నరా! అసలా బాకీలకు మీకూ ఏం సంబంధం పెళ్ళానికి నగలు చేయించినవా? పిల్లలకు పెళ్ళిల్లూ – పబ్బాలూ చేసినవా? మీరా బాకీలెందుకు తీర్చాలి?

"మా నాన్న చేసాడు కాబట్టి నేనాయన కొడుకును కాబట్టి

ఓలబ్బో పుట్టేడండి పెద్ద శ్రీరామచంద్రుడు వెనకా ముందూ చూచుకోకుండా ఆయనేదో అప్పులు చేస్తే అవన్నీ మీరు తీరుస్తారా? పోతూ పోతూ మీకేమైనా లక్షలిచ్చేడా ఆయన ఉండటానికి కొంప కూడా మిగల్చలేదు ఏదో నేనడుగు పెట్టిన వేళా విశేషం 'మనం యీ రోజు యిలా వున్నాం ఇది మీకు యిష్టంలేదా? నన్నూ – నా పిల్లల్ని అడుక్కుతినబెట్టాలనేగా మీ ఉద్దేశ్యం? పౌరాణిక నాటకాల్లో విలన్ని పతివ్రత దులిపేసినట్టు దులిపేసింది అరవింద ఆవిడకు కొంచెం వారపత్రికలు చదివి వంటలు చెయ్యడం, సినిమాలు చూసి జడల్లుకోవడం – రేడియోలో అభిరుచి కార్యక్రమంలో పేరు చెప్పించుకోవడం యీ మధ్యనే అలవాటైంది దాంతో కాస్త గడుసుతనం ఒంటపట్టింది భర్త చేస్తున్న పనిని తను సమర్థించలేక పోతోంది తన వాలకం చూస్తుంటే చివరికొచ్చేసరికి 'అక్షయ పాత్ర' మిగిల్చేలా వున్నాడనుకొని భయపడింది ఎలాగైనా ఆ పనిని ఆపాలని నిర్ణయించుకొంది ప్రథమ ప్రక్రియకు అతనితో వాదన'కు దిగింది ఎంత చెప్పినా గోపాల్రావు భార్యమాట వినలేదు తను పట్టిన పట్టు విడవలేదు తన తండ్రి రక్తం తనలో వుంది కాబట్టి ఆ బాకీలు తను తీర్చాల్సిందే అన్నాడు తన ఒంట్లో రక్తం ఉన్నంతవరకూ దాని రంగూ – పొంగూ తగ్గనంత వరకూ నీకూ నీ పిల్లలకూ భయం లేదని హామీ కూడా యిచ్చాడు భార్యాభర్తలకు వాదన రేగింది మాటా మాటా పెరిగి నువ్వెంతంటే నువ్వెంత అనుకున్నారు నా మాట వినకపోతే విషం మింగి చస్తా నంది ఆవిడ ఆ పని త్వరగా చెయ్యి అన్నాడు గోపాల్రావు అతనికి తెలుసు యీ కలీ యుగంలో విషం తింటే మనుష్యులు చావరని నా ప్రాణం కంటే మీకు మీ మాటే ముఖ్యమా?' అని ఆమె ముక్కు చీదింది వాద ప్రతివాదనలతో యిల్లు అసెంబ్లీ హాలులా భయంకరంగా తయారైంది మాటలు చేతల్లోకి మారేయి తొంత ముదిరి ఊసరవెల్లి అయినట్టుగా చెంబులూ తప్పాలాలూ సొట్టలు పడ్డాయి దుప్పట్లూ – తలగడలూ చిరిగిపోయేయ్ కప్పులూ – సాసర్లూ రూపాంతరం చెందాయి గోపాలరావుకు ఆ రాత్రి కంచం దగ్గర మంచం దగ్గఱ కూడా పస్తే

* * * * *

విజయనగరం చేరుకొనేసరికి మధ్యాహ్నం ఒంటి గంటైంది ఎండ శివుని మూడో నేత్రంలా వుంది కాలేజీ కుర్రాడితో షికార్లు కొట్టి తిరిగొచ్చిన కూతుర్ని చూసి మండిపడి చూచే రిటైరైపోయిన చిరుద్యోగి చూపుల్లా కూడా వుంది ప్రహ్లాదుణ్ణి కొండల మీద నుంచి తోసేసే సినిమా విలన్‌గాడి పోజులా వుంది అంత ఎండలో మిత్రులిద్దరూ పరంధామయ్యగారిల్లు చేరుకున్నారు గోపాల్రావు తండ్రీ – పరందామయ్య చిన్నప్పటి నుంచి ఒకర్నొకళ్ళు అంటిపెట్టుకొని తిరిగేవాళ్ళు తండ్రి ఎవరికెవరి కెంతెంత యివ్వాలో పరంధామయ్యకు తెలుస్తుందని గోపాల్రావు ఉద్దేశ్యం

విషయం విన్న పరంధామయ్యకు నోట మాట రాలేదు తను బ్రతికే వున్నాడో లేదో ఒళ్ళు గట్టిగా గిల్లుకొని తేల్చుకున్నాడు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళిన వయసులో వున్న ఆడపిల్ల క్షేమంగా తిరిగి ఒచ్చినట్లు, రేషన్ షాపుల్లో కార్డు మీద బియ్యం, పంచదార దొరుకుతున్నట్టు, హత్యలూ మానభంగాలూ లేని తెలుగు సినిమా చూస్తున్నట్టుగా వుంది అతనికి ఒకటికి రెండుసార్లు చెప్పాక గత్యంతరం లేక నమ్మేరు ఆ తర్వాత పెద్దగా నవ్వేడు ఆ నవ్వు అవసరమున్నా లేకపోయినా కార్యకర్తలను చూచి నవ్వే పార్టీ పెద్దలా వుంది మయసభలో అవసరమున్నా లేకపోయినా నవ్వాలి కాబట్టి నవ్వే దుర్యోధనుడిలా వుంది నీలాటి రేవు దగ్గర పల్లె పడుచుని చూచి మునసబు గారబ్బాయి వూరికే నవ్వే నవ్వులా వుంది ఆ నవ్వులో స్వాతంత్ర్యం వొచ్చి యిన్నేళ్ళయినా యింకా యింత అమాయకులున్నారా అన్న అర్థం వుంది కాస్సేపు నవ్వి గుండెల్లో నొప్పి వచ్చిన తర్వాత నవ్వు ఆపేడు ఊపిరి పీల్చుకొని అబ్బాయ్! మీ నాన్నా– నేనూ– ఒకే కంచం, ఒకే మంచం, అంటే ఎంగిలి కంచాల్లో తిన్నాం అని కాదు, అంత యిదిగా వుండేవాళ్ళం మీ నాన్న అతి మంచితనానికి పోయి

దెబ్బతిన్నాడు నువ్వు కూడా అదే బాటలో వెళ్లకు, ఓడిపోయినా అదే పార్టీని అంటిపెట్టుకొని వేళ్ళాడే అమాయకుల్లా కాబట్టి దారి మార్చు యీ రోజుల్లో సత్యహరిశ్చంద్రుడు పుడ్తే ఏం చేశవాడో తెలుసా, బాకీ వసూలు కొచ్చిన విశ్వామిత్రుడి దగ్గర కమండలం వగైరాలు లాక్కొని, గెడ్డం కూడా పీకించేసి విగ్గుల ఫ్యాక్టరీకి అమ్ముకొనే వాడు కాబట్టి యిలాంటి చెడు ఆలోచన్లు మానుకొని హాయిగా యింటికి వెళ్ళు" పోటి చేస్తే డిపాజిట్టు కూడా దక్కదు, కాబట్టి విరమించుకో అని సలహా యిచ్చే పార్టీ పెద్దలా బోధించేడు

అయినా వినలేదు గోపాల్రావ్ 'మీకు చేతనైతే సాయం చెయ్యండి, లేకపోతే వేరే మార్గం చూసుకుంటాను అంతేగాని బాకీలు తీర్చకపోవడం అనే సమస్య లేదు" ఖచ్చితంగా చెప్పేడు

"సరే నీ యిష్టం ఉత్తర దిక్కు ప్రమాదం, అటు వెళ్లకు అంటే అటే వెళ్తాను అనే కాశీ మజిలీ కథలోని రాజకుమారుడిలా వుంది నీ వాలకం అయినా, ఆ బాకీల వివరాలు నాకూ పూర్తిగా గుర్తులేవు, ఎప్పుడో పదిహేనేళ్ల నాటి మాట ఒక్క నిముషం ఆలోచించి అన్నాడు ఒక పని చెయ్ ఆ దావా ఫలానా కోర్టులో నడిచింది వివరాలు అక్కడ దొరుకుతాయ్ ప్రయత్నించు

యీ మాటలు గోపాల్రావుకు షుగర్ వ్యాధి వాడి ముందు మిఠాయి లా రుచించేయి ఆనందంతో ఎగిరి గంతెయ్యాలనుకున్నాడు కాని పైన సీలింగు ఫాన్ తిరుగుతుండడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నాడు

శలవ్ మళ్లీ వస్తాను బయల్దేరబోయేడు

బాబూ! ఒక్కమాట! ఆ దావా నడిపేటప్పుడు పెట్టుబడి పెట్టింది నేనే దాదాపు వెయ్యి దాకా వుంటుంది వెదవది వడ్డీ దేముంది గాని అసలు యిచ్చి వెళ్ళు. పరంధామయ్య మాటలు ఐస్ ముక్కల్లా చల్లగా వున్నాయ్

మీకూ బాకీ వుందా? మా నాన్నెప్పుడూ అనలేదండీ! గోపాల్రావులో చిన్న సంశయం ఒచ్చింది

'అనే వుంటాడు నీకు గుర్తుండక పోవచ్చు అయినా అప్పుడు నీ వయ స్సెంతని ఏదో పదిహేనో నీకు నమ్మకం వుంటేనే యియ్యి ఏదో పైలోకాల్లో వున్న స్నేహితుడి ఆత్మ ఎలక్షన్లో ఓడిపోయినోడిలా ఎక్కడ గిజగిజలాడిపోతుందో అని బెంగతప్ప వెదవది వెయ్యి రూపాయలేమంత భాగ్యమని నువ్వు నమ్మకపోతే యివ్వొద్దు" పరంధామయ్య కంఠంలో రవంత నిష్ఠురం తొంగి చూసింది

"ఎంత మాటండి, భలేవారే వంద కాగితాలు పది లెక్క బెట్టేడు గోపాల్రావ్ పరంధామయ్య అందుకోలేదు, లాక్కున్నాడు

'ఈయన ఏదో కిలాడీ చేసినట్టు అనుమానంగా వుందిరా నాకు ' పాపారావు మాటలు అర్థమైనా నీరసంతో సమాధానం చెప్పలేదు గోపాల్రావ్

★ ★ ★ ★

కోర్టు ఆవరణ చాలా హడావిడిగా వుంది నల్లకోట్లతో, చెట్ల క్రింద టప టప శబ్దాలు చేసే టైపు మిషన్లతో – పక్క పక్కన ఏడుపు మొగాల్తో నిలబడ్డారు గెలిచినోళ్ళూ–ఓడినోళ్ళూ -కూడా ఇవన్నీ చూసుకుంటూ– పార్టీల స్థితికి జాలిపడుతూ–– తమ స్థితిని నిందించుకుంటూ రికార్డు రూము అన్న ప్రదేశాన్ని చేరుకున్నారు మిత్రులిద్దరూ బూజు పట్టిన రికార్డులమధ్య శిదిలమైన కుర్చీలో గబ్బిలంలా వేళ్ళాడుతున్నాడో గుమస్తాజీవి అతనితో తమ వచ్చిన పని చెప్పేరు అంతా వినేసరికి అతనికి కూడా కళ్ళు బైర్లు గమ్మేయి తనున్నది యీదేశంలో నేనా, అందులోనూ కోర్టు ఆవరణలో నేనాఅని తమాయించుకొనేసరికి జిడ్డుమొఖంలో కొత్తకాంతులొచ్చేయి వయసుడిగి పోయిన వేశ్యకు బట్టతల, ఖద్దరు సిల్కు లాల్చీ లాంటి ఖరీదైన బేరం తగిలినట్టుగా వుంది అతనికి కుర్చీ మీద సర్దుక్కూర్చున్నాడు కాస్సేపు పైకి చూచేడు నెమ్మదిగా దగ్గేడు గట్టిగా సకిలించేడు కళ్లద్దాలు ఒకసారి సర్దుకున్నాడు చొక్కా రెండు సార్లు సర్దుకున్నాడు క్రాపు కూడా సర్దుకో బోయేడు కాని తనది బట్టతల అని గుర్తొచ్చి మానుకున్నాడు

అడిగిందానికి బదులు చెప్పకుండా పీటల మీద కూర్చో బోయే వాడిలా యీ పోజెంటో వాళ్లకు అర్థంకాలేదు అయినా తొందరపడలేదు ఆయన నోట్లోంచి ఏం ఊడిపడుతుందో అని కాచుక్కూర్చున్నారు ఎన్నికల ఫలితాలకోసం జనంలాగే

కాస్సేపు కళ్ళు మూసుకొని, తెరిచి, సగం మూసి, సగం తెరిచి, గుమస్తా నెమ్మదిగా శల విచ్చేడు

"చాలా పాత రికార్డండి దొరకడం కష్టం అని అదేదో ఏట్లో పారేసుకున్న ఉంగరంలా

"మీరు శ్రమతీసుకోవాలి తప్పదు మానాన్నగారి ఋణం తీర్చాలి గోపాల్రావు నెమ్మదిగానే అన్నా అందులో అర్థింపు వుంది

'మరి నా ఋణం మనసులో మాట బయట పెట్టేడు గుమస్తాబాబు ఎలక్షన్లో నిలబడినోళ్ళి సారా సిసాలడిగే పార్టీ మనుషుల్లా

మీకు కూడా మానాన్న బాకీ వున్నాడాండి?

'నీమొఖం కాగితాలు వెదికినందుకు ఏమిస్తావ్ అని అడుగుతున్నాడు, పాపారావు విడమర్చి చెప్పేడు


అంటే, లంచమా,

తప్పు దాన్ని లంచం' అనకూడదు మామూలు అనాలి అది పార్లమెంటరీ భాష

కాగితాలు చూడ్డమే వాళ్లపనికదా? వాళ్ళు ఉన్నది అందుకేగా?

నీకు జ్వరమొస్తే ఒచ్చింది అని సర్టిఫికెట్టు యివ్వడానికి డాక్టరు కెందుకు మామూలు?బస్సుల్లో లగేజీ కొట్టించి కూడా కండక్టరుకు 'పైన' ఎందుకివ్వాలి? అంతెందుకు కట్టుకున్న పెళ్ళాం అయినా నిన్ను చూసి నవ్వాలీ అంటే మల్లెపువ్వో– తెల్ల చీరో సమర్పించు కోక తప్పదు గదా! యిదీ అంతే! ముసి ముసినవ్వుల్తో అరటి పండు ఒలిచినట్టు చెప్పేడు పాపారావుకు అరికాలి మంట నెత్తికెక్కింది ఒక అమాయకుడు, ఏచదువూ లేనివాడు, ఏనాడో రద్దయి పోయిన బాకీ తీర్చడానికి నిజాయితీతో ముందుకు వస్తే న్యాయస్థానంలో పని జేసే నువ్వు, నువ్వు చెయ్యాల్సిన పనికి లంచం అడుగుతావా? అందుకే న్యాయదేవత కళ్లకు గంతలు కట్టు కొని విలపిస్తోంది నాలుగూ దులిపేశేడు

ఏవయ్యోయ్! నీ ఉపన్యాసాలు ఆపు నీ సోదంతా



వినడానికి నీ దగ్గరకు పంచదార కార్డు కొచ్చిన పార్టీని కాదు నీకు తెలిసిన 'నీతి చంద్రిక' అంతా నా మీద రుద్దడానికి నువ్వేమి తాసిల్దారువు కావు నాతో పని కావాలంటే నేను చెప్పినట్లు చెయ్యి లేకపోతే వెళ్ళు అవతల నాకు పనుంది అంటూ బల్లమీద ఒరిగిపోయి కళ్ళు మూసుకున్నాడు

పాపారావు ఆవేశం తగ్గి పోయింది తనున్నది తన దేశంలోనే అని గుర్తొచ్చేసరికి గోపాల్రావు మొగం కూడా నయాపైసా అంత అయింది అదికార్ పార్టీ అభ్యర్ధిలా గుమస్తా మహాను భావుడు కళ్ళు మూసుకున్నాడు యింకాసేపైతే గురక లోకి జారిపోయి లేపితే నిద్రాభంగం నేరం క్రింద మరింత జరిమానా విధిస్తాడేమోనని భయపడి నెమ్మదిగా లేపి మీదయిచ్చి నట్లు కానీయండన్నారు బల్ల మీద చేయితీసి కాగితాలు జేబులోకి తోసి రేపు రండి లిస్టు రెడీగా వుంటుందని చెప్పి మళ్ళీ బల్ల మీద ఒరిగిపోయేడు

★ ★ ★ ★ ★

మొత్తం బాకీదార్లు పన్నెండు మందికి పరంధామయ్య కబురంపేడు కాని వచ్చింది ఇరవైమంది 'ఇదేంటని' మిత్రులిద్దరూ ఆశ్చర్య పోయేరు

మేం కూడా మీనాన్నకు అప్పులిచ్చాం అన్నారు కోరస్ గొంతులో

కోర్టు లిస్టులో మీపేర్లు లేవు'

మేం కోర్టు కెళ్ళలేదు నమ్మకం మీద అప్పుడప్పుడు బాకీలు పెట్టేం దానికి కాగితం, కలాలూ లేవు యీలోపులే మీ నాన్న దివాళా ఎత్తే సరికి "ముసల్దానికి కన్ను కొట్టినట్లు ఆతన్ని పీడించడం ఎందుకని ఊరుకున్నాం యిప్పుడు నువ్వు బుద్ధి మంతుడివై బాకీలు తీరుస్తున్నావని వచ్చేం"

కోర్టు బాకీలు తప్ప వేరే బాకీలు తీర్చము' పాపారావు ఖండితంగా చెప్పేడు

ఏంటయ్యా మీ ధోరణి, అసలీ బాకీలైనా తీర్చమని

# నీతీ! నీ చిరునామా ఎక్కడ?

ఎవడేడ్చేడు ఎవరైనా మీదగ్గరకొచ్చి అఘోరించారా – యింటింటికి తిరిగి ఓట్లడుక్కున్నట్లు ! కోర్టు బాకీలు కూడా ఎగ్గొట్టండి నీతి-- నిజాయితీ వుంది ఆ 'అయ్య' సంతానమైతే మా అప్పులు తీర్చు లేకపోతే మానెయ్ మాకేమైనా లెక్కా, జమా? అవతలి వాళ్ళు కూడా రెచ్చిపోయేరు ఓడిపోయిన ప్రతి పక్షంలా

సుహృద్భావ వాతావరణంలో మొదలైన చర్చలు ఉద్రిక్త వాతావరణంలోకి చేరుకున్నట్లు విషయం ముదిరేసరికి పరంధామయ్య కల్పించు కొని బాబూ గోపీ! విషయాలు ప్రశాంతంగా ఆలోచించి తేల్చుకోవాలి గాని రాజకీయ నాయకుల్లా రోడ్డున పడకూడదు వీళ్ళంతా నాకు తెలిసిన వాళ్ళే మీ నాన్నకు వీళ్ళు బాకీలు పెట్టడం 'ప్రతి పక్షాలు ఏకంకావు' అన్నంత నిజం చివరి రోజుల్లో మీ నాన్నను బాకీల వాళ్ళు కాకుల్లా పొడుస్తుంటే, వీళ్ళు తప్పుకున్నారు పొడవడానికి చోటులేక ఫలానా వాడు బాకీలు ఎగ్గొట్టి చచ్చేడు అనే చెడ్డపేరు రాకుండా వుండాలంటే ఏదో రూపాయ దగ్గర పావలా అయినా యిచ్చి బయట పడ్డం మంచిది లేకపోతే అనవసరంగా అల్లరి పడిపోతావ్ ఎవడి కడుపు మండినా– ఉసురు తగిలినా మనకు మంచిది కాదు పిల్లా– పాపా వున్నోడివి నా మాట విని ఏదో సరిపెట్టు' అని నిర్ణయించాడు

స్నేహితు లిద్దరూ మొఖ మొఖాలు చూసుకున్నారు ఆ తర్వాత జేబులు కూడా చూసుకున్నారు గోపాల్రావుకి జ్వరవొచ్చినంత పనైంది యీ వ్యవహారం యిన్ని మలుపులు తిరిగేసరికి మంచి' లో యిన్ని చికాకులుంటాయని అందుకే 'ప్రజా ప్రతినిధులు' ప్రజా సేవకు చాలా దూరంగా వుంటార్నని యిప్పుడే అర్ధమైంది పెళ్ళాంకు చేయించిన కొత్త నగలు అమ్మి పాత బాకీలన్నీ తీర్చేసి బరువుగా ఊపిరి పీల్చుకున్నాడు గోపాల్రావు

★ ★ ★ ★ ★

నెల రోజుల్తర్వాత అకస్మాత్తుగా ఊడిపడి 'అన్యాయం జరిగి పోయిందిరా' అన్నాడు పాపారావుతో గోపాల్రావు

ఏమైంది , రైళ్ళుగాని సకాలంలో నడుస్తున్నాయా?' అడిగేడు పాపారావు కాదు; పరంధామయ్య మనల్ని ఘోరంగా మోసం చేశేడు మానాన్న నిజంగా వాళ్ళ కెవ్వరికీ బాకీలేడట పరంధామయ్య ప్రవేశపెట్టిన పాత్రలేనట వారంతా జాయింటుగా మోసం చేసి డబ్బు పంచుకున్నారట

ఇదంతా నీ కెలా తెలిసింది? పాపారావుకు ఆశ్చర్యంగా వుంది

"మావూరతను కలిసి చెప్పేడు పరంధామయ్య వాళ్ళూ తిరుపతెళ్ళి గుండ్లు' కూడా గీయించుకున్నారట '

' ఆపని మనకిక్కడే జరిగిపోయిందిగా' ఒరేయ్ గోపీ! 'నీతి'అనేది 'మైక్రోస్కోపు'కి కూడా అందకుండా పోయిందిరా నీతి అంటే యీ రోజుల్లో 'పిచ్చి' అని అర్ధం వెధవడబ్బు పోతే పోయింది బాధపడకు ఎప్పుడైనా సంపాదించుకోవొచ్చు భుజం తట్టేడు పాపారావ్

డబ్బు గురించి కాదురా నాబాధ' అసలు యీ లోకం ఎందుకింతగా దిగజారి పోతోందా? అనే గోపాల్రావ్ నెమ్మదిగా గొణుక్కున్నాడు! ☐

## అంకితం.

నాఊహాలేశన ఊపిరిగా జీవిస్తూ
నాలో నే సర్వస్వాన్నీ చూస్తున్న నా
భార్య "జయలక్ష్మి"కి — రచయిత

